# సింగిల్ పేజీ కథలు

'పందిట్లో పెళ్ళవుతున్నాది, నను విందవుతున్నాదీ' మధురంగా మ్రోగుతోంది సన్నాయి మేళం. పచ్చని మామిడి తోరణాలు, అందంగా అలంకరింపబడ్డ ష ాల మండపం. రంగురంగుల విద్యుద్దీపాలతో పెళ్ళి మండపం మెరిసిపోవటం ఒక ఎత్తు అయితే, పట్టుచీరల పరిమళాలు, కన్నెపిల్లల సోయగం,



కుర్రకారు కోలాహలం మరొక ఎత్తు. వెరసీ పెళ్ళంటే ఒక సందడి, ఒక మధురానుభూతి, ప్రతివారి మనసులో పదిలంగా దాచుకొనే ఒక తియ్యని జ్ఞాపకం!

మా అక్కయ్యగారి అబ్బాయి పెళ్ళికి నా భార్యతోసహా వచ్చాను. ఈ హడావుడీ, ఈ ఆనందం చూస్తుంటే నేనెంత మిస్ అవుతున్నానో అని బాధేస్తోంది. వ్యాపారరీత్యా ఢిల్లీలో సెటిల్ అయ్యి పది సంవత్సరాలు కావస్తుంది. ఎప్పుడు వచ్చినా ఏదో ఒకటి, రెండురోజులు అమ్మ, నాన్నతో గడిపి హడావిడిగా వెళ్ళటమే తప్ప సావకాశంగా ఫ్రెండ్సుతో కూడా గడిపింది లేదు!

''ఏరా వేణు బాగున్నావా?'' మా బాబాయి పరామర్శ!

''ఏమయ్యా అల్లుడూ! బాగా సంపాదించావుటగా!'' మా మేనత్త పలకరింపు.

''హాయ్ బ్రదర్ ఎప్పుడొచ్చావ్?'' చిన్ననాటి మిత్రబృందం చుట్టుముట్టారు.

## తృప్తి

అందరి పలకరింపులూ, పరామర్శల మధ్య ఉక్కిరి బిక్కిరి అవుతూ సరదాగా ఎంజాయ్ చేస్తున్న నాకు ''మా కోడలు'' గర్వంగా ఎవరికో పరిచయం చేస్తున్న అమ్మగొంతు వినబడి తలతిప్పి చూశాను. ఎవరో ముసలావిడ గీతను చూసి ''బంగారు బొమ్మలాగుంది'' మెటికలు విరుస్తూ అంది. అసలే తెల్లటి మేనిచాయ, దానికితోడు పసుపుపచ్చ పట్టుచీరలో కుందనపు బొమ్మలాగా కనబడుతోంది గీత. చిన్నగా నవ్వుకుంటూ మిత్రబృందంతో కబుర్లలో పడ్డాను. మండపం అంతా కలియతిరుగుతూ అందరినీ పేరు పేరునా పలకరిస్తున్న ఆమెను రాధగా గుర్తించటానికి నాకు కొంత టైం పట్టింది. ఆమె వైపే పరిశీలనగా చూడసాగాను. అసలు ఆమె రాధేనా అన్న అనుమానం కలిగింది. జీవం లేని కళ్ళు, కళ్ళక్రింద నల్లని వలయాలు, కాంతిని కోల్పోయిన చర్మం, పేలవమైన నవ్వు, పది సంవత్సరాల వయస్సు పైబడినట్లు ఏదో దిగులు. ఏమిటిది? నేను చూస్తున్నది కలా? నిజమా?, ఆ ప్రక్కగా వెళుతున్న మా బాబాయి కొడుకు భాస్కర్‌ని పిలిచి ''భాస్కర్ ఆమె రాధ కదూ'' అనుమానంగా అడిగాను.

''అవునన్నయ్యా! పాపం నిన్ను కాదని ఆఫీసరు, అందగాడు అని చేసుకొన్న ఆ మొగుడు వ్యసనాలతో, బ్యాంక్ డబ్బు కాజేసి, ఉన్న ఉద్యోగం పోగొట్టుకున్నాడు. ఆస్తి మొత్తం కరిగించేసి ఇప్పుడు మంచాన పడ్డాడు'' ఎగతాళిగా అన్నాడు భాస్కర్.

''ఏమయింది?'' ఆదుర్దాగా అడిగాను.

''రెండు కిడ్నీలు చెడిపోయాయట. ఆపరేషన్‌కి డబ్బు లేక ఇదుగో ఇలా అందరి సహాయం అడుగుతోంది. ఏదో పది, పాతిక అంటే సర్దగలం కానీ అంత డబ్బు ఎవరిస్తారు చెప్పు? మామయ్య కూడా ఒక్కగానొక్క కూతురు జీవితం ఇలా అయిందనే దిగులుతోనే పోయాడు. ఉన్న పెద్ద దిక్కు కాస్తా పోవటంతో ఒకరకంగా రాధ దిక్కులేనిదే అయింది'' జాలిగా అన్నాడు వాడు.

రాధ స్వయంగా నా మేనమామ కూతురు. ఆ రోజుల్లో అందమైన రాధని చేసుకోవాలని ఆశపడ్డాను. కానీ డిగ్రీ కూడా లేదని, నల్లగా ఉండే నేను అందంగా లేనని రాధ తిరస్కరించింది. ఆ తరువాత నా ప్రాణమిత్రుడు మధు సహాయంతో ఢిల్లీలో చిన్న బిజినెస్ ప్రారంభించిన నాకు వెనుకకు తిరిగి చూడవలసిన అవసరం రాలేదు. ఇప్పుడు నేను కోటీశ్వరుణ్ని. అక్కడే సెటిల్ అవ్వటంతో నాకు ఈ విషయాలు తెలియవు.

ఒకరకంగా చెప్పాలంటే నా ఉన్నతికి కారణం పరోక్షంగా రాధే. ఆమె తిరస్కారం నాలో పట్టుదలను పెంచింది. నిరంతరం శ్రమించి ఈ స్థాయికి చేరుకునేలా చేసింది. ఒక నిర్ణయానికి వచ్చి చిరునవ్వుతో రాధ వైపు అడుగులు వేశాను. నన్ను చూసి తలదించుకొంది.

''విషయమంతా విన్నాను రాధా'' నావైపు తలెత్తి చూసింది. ఆ కళ్ళనిండా నీళ్ళు. గబగబా జేబులోంచి చెక్కుబుక్కు తీసి రెండు లక్షలకి సంతకం పెట్టి రాధ చేతిలో ఉంచాను. నమ్మలేనట్లు చూసింది. నా బాహ్యసౌందర్యాన్ని అసహ్యించుకొన్న సంఘటన గుర్తుకు వచ్చింది కాబోలు, కన్నీళ్ళతో రెండు చేతులూ జోడించింది.

జోరుగా మ్రోగుతున్నాయి బాండ్, సన్నాయి. మాంగల్యధారణ జరుగుతోంది. ఒక మాంగల్యాన్ని నిలబెట్టానన్న తృప్తితో వధూవరులను ఆశీర్వదించటానికి అడుగు ముందుకు వేశాను.

-అడపా పద్మ
(జగ్గయ్యపేట)